క్లుప్తంగా

కావలి మున్సిపల్ కమిషనర్‌గా కిరణ్


కిరణ్

కావలి: కావలి మున్సిపల్ కమిషనర్‌గా అసిస్టెంట్ ఆడిట్ అధికారి ఈ కిరణ్‌ను డిప్యుటేషన్‌పై నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు కావలి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బీ శివారెడ్డిని మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో తిరుపతి ఆడిట్ కార్యాలయంలో అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌ను నియమించింది.

డయల్ యువర్ డీఎంకు వినతుల వెల్లువ

కావలి: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ప్రధానంగా కొత్త రూట్లలో బస్సు సర్వీసులు నడపాలని, నాన్‌స్టాప్ బస్సులను నిలపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేయగా, డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు సానుకూలంగా స్పందించారు. బిట్రగుంట నుంచి నెల్లూరు, కరేడు నుంచి నెల్లూరు, కావలి నుంచి నందిపాడు మీదుగా కడప, గుండెమడకల నుంచి బద్వేలు, కావలి నుంచి వింజమూరు, చాకలికొండ మీదుగా పామూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. అలాగే తిప్పలో నాన్‌స్టాప్ బస్సులకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని కోరగా, ఇప్పటికే 12 బస్సులకు స్టాపింగ్ ఉన్నందున కొత్తగా స్టాపింగ్ ఇవ్వడం కష్టమని తెలిపారు. కొండబిట్రగుంట క్షేత్రానికి ప్రతి శనివారం బస్సులు నడపాలని భక్తులు విజ్ఞప్తి చేయగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

నృత్య కళాకారులకు ప్రశంసలు



కావలి: పట్టణంలోని శ్రీవిఘ్నేశ్వర నృత్య కళా నిలయానికి చెందిన ముత్యంశెట్టి ఉమామహేశ్వరరావు శిష్యబృందం తమ నృత్య ప్రదర్శనతో ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల భారత్ ఆర్ట్స్‌అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ సంయుక్తంగా వారణాసిలో నిర్వహించిన కాశీ విశ్వనాథుని నృత్యాభిషేకంలో చిన్నారుల తమ నృత్య ప్రదర్శనతో ఆహుతులను ఆకట్టుకున్నారు. దీంతో చిన్నారులను నిర్వాహకులు అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న వాకా మల్లికార్జునకు ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. 'కల్చరల్ టూరిజం ఇన్ ఆంధ్రప్రదేశ్ ఇట్స్ స్కోప్ అండ్ డెవలప్‌మెంట్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టూ మాన్యూ మెంటల్ హెరిటేజ్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన పత్రానికి గానూ వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మల్లికార్జునను డిగ్రీ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

వసతిగృహాల్లో ఎక్కువ మంది చేరాలి

నెల్లూరు(దర్గామిట్ట): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఎక్కువ మంది చేరేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖలో అమలవుతున్న పథకాలు, వసతి గృహాల పనితీరు, వసతులు, తాగునీరు, పరీక్ష ఫలితాలు, తదితర అంశాలపై సాంఘిక సంక్షేమాధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో ఎక్కువ మంది పిల్లలు వసతిగృహాల్లో చేరేలా చర్యలు చేపట్టాలని కోరారు. జగనన్న విద్యా, వసతిదీవెన పథకాల్లో ప్రభుత్వమిస్తున్న సాయాన్ని కళాశాలలకు సక్రమంగా చెల్లిస్తున్నారా..లేదా అనే అంశాన్ని పరిశీలించాలన్నారు. వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్లు ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసుకోవాలన్నారు. నాడు–నేడు కింద వసతిగృహాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామని, మూడు వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేస్తున్నాయని డీడీ వెంకటయ్య తెలిపారు.

జీజీహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలను అందించేందుకు అన్ని విభాగాలకు చెందిన హెచ్‌ఓడీలు చర్యలు చేపట్టాలని ఆస్పత్రి, మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రమేష్‌బాబు సూచించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యశాఖ హెచ్‌ఓడీలతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, నేత్ర, ఈఎన్టీ, స్కిన్, పల్మనాలజీ, డెలివరీలు, తదితర అన్ని విభాగాల్లో ఆరోగ్యశ్రీ కేసులను పెంచాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కేసులు పెరిగితే రోగులకు ఆరోగ్యంతో పాటు ఆస్పత్రికి ఆదాయం చేకూరుతుందని తెలిపారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఐదో ఏడాది మొదటి విడత రైతుభరోసా నగదు విడుదల సందర్భంగా పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించి సీఎం వైఎస్ జగన్ సాగులో వారికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని తెలిపారు. దివంగత సీఎం వైఎస్సార్ వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను అందించడంతో పాటు రుణమాఫీ కల్పించి రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. ఆయన తనయుడు అంతకు మించి రైతులకు రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 పెట్టుబడి సాయాన్ని అందిస్తూ ఆదుకుంటున్నారన్నారు. ఐదో ఏడాది మొదటి విడత కింద ఆత్మకూరు నియోజకవర్గంలోని 37,319 మంది రైతు కుటుంబాలకు రూ.2,052.55 లక్షల లబ్ధి చేకూరనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు మండలంలో 7013 మంది రైతులకు రూ.385.72 లక్షలు, ఏఎస్‌పేటలో 5578 మందికి రూ.306.79 లక్షలు, మర్రిపాడులో 7560 మంది రైతులకు రూ.415.80 లక్షలు, సంగం మండలంలో 4185 మందికి రూ.230.18 లక్షలు, అనంతసాగరంలో 6027 మందికి రూ.331.49 లక్షలు, చేజర్లలో 6956 మంది రైతులకు రూ.382.58 లక్షలు వంతున రైతు భరోసా నగదు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమకానుందని తెలిపారు.

అకాల వర్షాలకు నష్టపరిహారం

ఇటీవల రెండు నెలల వ్యవధిలో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు రూ.29 లక్షలు పరిహారం అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఏఎస్‌పేట మండలంలో 202 మంది రైతులకు సంబంధించి 183.65 హెక్టార్లలో పంట నష్టం జరుగగా రూ.26.94 లక్షలు పరిహారం అందజేయనున్నట్లు చెప్పారు. ఆత్మకూరు మండలంలో 30 మంది రైతులకు సంబంధించి 13.76 హెక్టార్లలో పంట నష్టం జరగగా రూ.2.06 లక్షల పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఏ సీజన్‌లో పంట నష్టం జరిగినా ఆ సీజన్ ముగిసేలోగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం పారదర్శకంగా నష్టపరిహారం మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ఈ ఏడాది రెండో పంట సాగుకు పుష్కలంగా నీరు విడుదల చేయడంతో రైతులు ఉత్సాహంగా సాగు పనుల్లో నిమగ్నమై ఉన్నారన్నారు.

ముగిసిన అంకమ్మ తిరునాళ్ల


అంకమ్మ గ్రామోత్సవం


ఆలయం చుట్టూ బండ్ల ప్రదక్షిణ


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కొండాపురం : మండలంలోని గొట్టిగుండాలలో జరుగుతున్న కోటా అంకమ్మతల్లి తిరునాళ్ల గురువారం రాత్రితో ముగిసింది. చివరి రోజు అంకమ్మకు పొంగళ్లు, బండ్లు తిరుగుట, మొక్కుల చెల్లింపు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి పొంగళ్లు పెట్టి ఆలయం చుట్టూ తమ బండ్లు తిప్పి మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ



చేజర్ల: మండలంలోని పాడేరు సచివాలయం పరిధిలోని బొగ్గలవారికండ్రికకు చెందిన బొర్రా రామాంజనేయులు అనారోగ్యంతో మరణించగా వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు చెక్కు మంజూరైంది. మృతుడి భార్యకు సచివాలయ సిబ్బంది గురువారం చెక్కు అందజేశారు. పాడేరు సర్పంచ్ వెంకటేశ్వర్లు, వీఆర్వో ప్రసాద్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్, సచివాలయ కన్వీనర్ వెంగళరెడ్డి, వలంటీర్ రామాంజనేయులు, నాయకులు హజరత్ రెడ్డి, చంద్రమౌళి, బొగ్గల వెంగళరెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

886 పొగాకు బేళ్ల కొనుగోలు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 886 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతులు 938 బేళ్లను వేలానికి తీసుకురాగా, 886 బేళ్లను కొనుగోలు చేశామని, 52 బేళ్లను తిరస్కరించామని వివరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.161, కనిష్టంగా రూ.70, సగటున రూ.104.29 ధర పలికిందని చెప్పారు. వేలంలో 8 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

అంకమ్మ తిరునాళ్లకు తరలివెళ్లిన భక్తులు


తిరునాళ్లకు తరలి వెళుతున్న బండ్లు

కలిగిరి: కొండాపురం మండలం గొట్టిగుండాలలో జరుగుతున్న అంకమ్మతల్లి తిరునాళ్లకు మండలంలోని భక్తులు గురువారం తరలివెళ్లారు. అంకమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు తమ ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించుకుని బంధు,మిత్రులతో కలిసి వెరు. కాగా తెల్లపాడుకు చెందిన మారేళ్ల మహాదేవరెడ్డి కుటుంబ సభ్యులు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి అంకమ్మ తిరునాళ్లకు వెళ్లే భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.

పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఉదయగిరి: ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో లింగమనేనిపల్లికి చెందిన పసుపు రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దిగుబడులను విక్రయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర అందించాలని కోరారు. పసుపు రైతులకు బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కావలి: గర్భిణులు, బాలింతలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి సూచించారు. డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో పట్టణంలోని శంకులవారితోటలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సంరక్షణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. డైరెక్టర్ తాతిరెడ్డి మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం గర్భిణులకు ఐరన్ సిరప్‌లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం


హంసవాహనంపై ఆత్మారాముడు


దువ్వూరులో ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు

సంగం: మండలంలోని దువ్వూరులోని గంగాపార్వతి సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

హంస వాహనంపై ఆత్మారాముడు

అన్నారెడ్డిపాళెంలోని ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా హంస వాహన సేవను బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. హంస వాహనంపై ఆత్మారాముడి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



చేజర్ల: మండల నూతన ఎంపీడీఓగా కరీముల్లా గురువారం బాధ్యతలు స్వీకరించారు. డక్కిలి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు మండల పరిషత్ ఏఓ విజయలలిత ఇన్‌చార్జి ఎంపీడీఓగా వ్యవహరిస్తున్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



కలిగిరి: కలిగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎండీ ఫరూఖ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐగా విధులు నిర్వహిస్తున్న సాంబశివరావు ప్రకాశం జిల్లా వినుకొండకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గిద్దలూరులో విధులు నిర్వహిస్తున్న ఫరూఖ్ బదిలీపై వచ్చారు.

గడ్డి వాముల దగ్ధం

జలదంకి : మండలంలోని కొత్తపాళెంలో లోకిరెడ్డి మహేంద్రరెడ్డి, మాల్యాద్రిరెడ్డి సోదరులకు చెందిన రెండు గడ్డి వాములు గురువారం అగ్నికి ఆహుతయ్యాయి. పశువుల మేత కోసం 18 ఎకరాల్లోని గడ్డిని వాములుగా వేసుకోగా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు అంటుకున్నాయి. స్థానికుల సమాచారంతో కావలి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.90 వేల విలువైన గడ్డి అగ్నికి ఆహుతైనట్లు బాధితులు వాపోయారు.

వలంటీర్లకు సన్మానం



సంగం: మండలంలోని వెంగారెడ్డిపాళెం సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, అరుణ, వెల్ఫేర్ అసిస్టెంట్ శరత్, డిజిటల్ అసిస్టెంట్ మహేంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివ, ఆరీఫ్, ఏఎన్ఎం రమ, వీపీఏ లావణ్య, వీఆర్వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

ఆత్మకూరు: నెల్లూరులోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నివాసం వద్ద దివ్యాంగులకు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అలింకో, ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం (ఏడీఎఫ్) సహకారంతో గత నెల 22న ఆత్మకూరులో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న దివ్యాంగులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఏకం కావాలి



ఉదయగిరి: ప్రభుత్వ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ ఉద్యోగుల సంఘ జిల్లా జాయింట్ సెక్రటరీ జావీద్ అన్నారు. గురువారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న సంఘ సమావేశంలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, ఉపాధి కార్యాలయాల్లో అధికారులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి తాలూకా అధ్యక్షుడు కొండారెడ్డి, కార్యదర్శి సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం


కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న ఎస్పీ, ఎమ్మెల్యే


లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవం

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం ఉప్పలపాడులో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో నూతన దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట, కలశ శిఖర ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. వారికి ఆలయ ధర్మకర్తలు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని గ్రామస్తులు సమష్టిగా దాతల సహకారంతో ఎంతో సుందరంగా నిర్మించడం సంతోషకరమన్నారు. త్వరలో సోమశిల శివాలయాన్ని రూ.2 కోట్లతో ఆధునీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ ఊరుబిండి ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం..లక్ష్మీనరసింహుని కల్యాణం

ఉప్పలపాడులో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై దేవదేవరులను కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విస్తృత పర్యటన


రమాదేవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మర్రిపాడు మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించారు. కదిరినేనిపల్లిలో షేక్ షఫీవుల్లా కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. చిన్నమాచనూరు సర్పంచ్ కటకం నరసింహారావు సోదరుడి వివాహం ఇటీవల జరుగగా వారి ఇంటికి వెళ్లి నూతన దంపతులు లక్ష్మణ్, నాగదుర్గాను ఆశీర్వదించారు. అనంతరం పెద్దమాచనూరులో సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకుల నరసింహారెడ్డి మరదలు రమాదేవి ఇటీవల పిడుగుపాటుకు గురై మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. రమాదేవి ముగ్గురు బిడ్డలకు భవిష్యత్‌లో తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు కన్నపురెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, ఒంగోలు శ్రీనివాసులురెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఎం లక్ష్మీరెడ్డి, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దర్గా అభివృద్ధి పనులు



ఆత్మకూరురూరల్: కరటంపాడులోని జాతీయ రహదారి పక్కనున్న దర్గాలో దాతల సహకారంతో అభివృద్ధి పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన దర్గా జాతీయ రహదారి నిర్మాణంతో లోతట్టుకు చేరింది. దీంతో దాతల సహకారంతో దర్గా ప్రాంగణంలో మట్టితోలి చదును చేసి ఎత్తు పెంచారు. దర్గా చుట్టూ ప్రహరీ, పూజాసామగ్రి గదులను పునర్నిర్మించారు. కరటంపాడుకు చెందిన ఆర్యవైశ్యులు గూడూరు శంకర్, తాతా సురేష్ కుటుంబ సభ్యులు, పాశం వెంకటేశ్వర్లు, చదలవాడ కృష్ణయ్య, తదితరులు దాతల సహకారంతో దర్గా అభివృద్ధికి కృషి చేయడంపై ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు


నువ్వూరుపాడులో చిన్నారుల బరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: మండలంలోని నువ్వూరుపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల ఎత్తు, బరువు, ఆరోగ్య పరిస్థితి, పౌష్టికాహారం పంపిణీని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీలోగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఎత్తు, బరువుతో పాటు వారికి అందిస్తున్న పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు చిన్నారులకు ఆధార్‌కార్డుల నమోదు, బర్త్ సర్టిఫికెట్లు మంజూరులో అంగన్‌వాడీలకు సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సహాయకుడు అబ్దుల్ రవూఫ్, ఏఎన్ఎం పద్మ, మహిళా పోలీసు గౌసియా, ఆయా విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

81 శాతం పింఛన్ల పంపిణీ


డీసీపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో జూన్ నెలకు సంబంధించిన సామాజిక పింఛన్లను తొలి రోజైన గురువారం 81 శాతం మందికి పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి కమిషనర్ బీ నాగేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ పరిధిలో 3,369 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, 2729 మందికి పింఛన్లను వలంటీర్లు అందజేసినట్లు వివరించారు. మిగిలిన వారికి శుక్ర, శని వారాల్లో పింఛన్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. ఆత్మకూరు మండలంలో 4,889 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, తొలిరోజు 3,459 మందికి నగదు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. అలాగే మర్రిపాడు మండలంలో 6,120 మంది లబ్ధిదారులు ఉండగా, తొలి రోజు 3,511 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్ పేర్కొన్నారు.

సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లు ఆలస్యం

ఆత్మకూరు: రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లు ఆలస్యం చేస్తున్నట్లు ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ జీవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండ్రోజుల వ్యవధిలో 80 రిజిస్ట్రేషన్లు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం సాంకేతిక సమస్యతో సర్వర్ నిధానంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు పెంచిన భూముల విలువలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయని చెప్పారు. ఆత్మకూరు సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని 77 గ్రామాలకు గానూ 16 గ్రామాలకే పెంచిన భూముల విలువ వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం ఏటా భూముల విలువ 15 నుంచి 25 శాతం పెంచుతుందన్నారు. కరోనా కారణంతో గత రెండేళ్లుగా భూముల విలువ పెంచలేదని తెలిపారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాలను బట్టి 30 నుంచి 40 శాతం భూముల విలువ పెరిగిందని వివరించారు. ఏటా పెంచే విధానంతో పోల్చుకుంటే ప్రస్తుతం పెంచిన విలువ పది శాతం తక్కువేనన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులు 67, 586 పరిధిలోని ఏఎస్‌పేట మండలం గుడిపాడు, చిరమన, అనంతసాగరం మండలం అనంతసాగరం, పాతాళపల్లి, మంగుపల్లి గ్రామాలతో పాటు గతంలో ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరిగిన గ్రామాల్లో ప్రస్తుతం పెంచిన విలువ వర్తిస్తుందని తెలిపారు. దీంతో పాటు నిర్మాణాల విలువ సైతం పెరిగిందన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా


ప్రయోగాలు చేస్తున్న చిన్నారులు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మర్రిపాడు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులు ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు. మ్యూజికల్ చైర్స్, అంత్యాక్షరి, దాగుడుమూతలు, తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల ప్రయోగాలు చేశారు. గ్రంథాలయాధికారి నారాయణరావు వేదగణితంలో సులభంగా కూడికలు, తీసివేతలు, పొడుపు కథలను తెలిపారు.